క్లుప్తంగా

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా సీఐ డి.వి.రమణ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి వేలి ముద్రలు, సంతకాలు సేకరించారు. సత్ప్రవర్తనతో మెలగకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబంతో హాయిగా జీవించాలని సూచించారు. మీరు చేసే పనులపై నిఘా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ షిర్డీ సాయి ఆటో స్టాండ్ డ్రైవర్ల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు. స్కూల్ పిల్లల ఆటోలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు పెడుతున్న అక్రమ కేసులు వెంటనే ఆపాలని, కోర్టులో డ్రైవర్లను హాజరు పరిచే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. స్కూలు పిల్లల ఆటోలకు పది మందికి అనుమతి ఇవ్వాలని, కాలేజీ పిల్లల ఆటోలకు 8 మందికి అనుమతి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే డ్రైవర్లకు రూ. 15 వేలు అందజేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఓలా, ఉబర్, రాపిడ్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షుడు నక్క శీను, ఆవాల చిన్న, పిట్ట చిన్న, ఎస్. గణేష్, రావి అశోక్, పిన్నింటి కృష్ణ నాయుడు పాల్గొన్నారు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా.. ధారకొండ



అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైన ధారకొండ ప్రాంతం

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని ధారకొండ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడ గతంలో కొన్నిసార్లు యువకులు గంజాయితో అరెస్టు కావడం తెలిసిందే. ఈ ప్రాంతంలో ఆకతాయిలు, గంజాయి బ్యాచ్‌లు పెద్ద ఎత్తున మకాం వేసినా సరే నాలుగో పట్టణ పోలీసుల నిఘా శూన్యం కావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మద్యపానం, గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని చెబుతున్నారు. ధారకొండకు సమీపంలోనే రాధాకృష్ణ లేఅవుట్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్షన్ వంటి పోష్ ఏరియాలున్నాయి. ఇక్కడ పలువురు వీవీఐపీలు కూడా నివసిస్తున్నారు. సాధారణంగా రోజూ రాత్రి పూట ఇక్కడ కొన్ని బ్యాచ్‌లు ఒకచోట చేరడం ఆనవాయితీగా మారిపోయింది. ధారకొండ వీరికి వరంగా మారిందనే చెప్పాలి. చుట్టుపక్కల ప్రజల ఇబ్బందులు ఎవరికీ పట్టడం లేదు. గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో గంజాయి విక్రయించే ఒక మహిళను పట్టుకున్నారు. అయినప్పటికీ ఈ కొండ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు ఆగడం లేదు. ఫోర్త్ టౌన్ పోలీసులు ధారకొండలో నిఘా ఉంచి ఆకతాయిలు, గంజాయి బ్యాచ్‌లను అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయితో యువకుడి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఒక మైనర్ సహా యువకుడిని టూటౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లాకు చెందిన షణ్ముఖ్ (18) ఒక బాలుడితో కలిసి అరుకు నుంచి కేజిన్నర గంజాయి తీసుకుని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. ఈ మేరకు పోలీసులు తమకు అందిన సమాచారం మేరకు వారిని సెంట్రల్ పార్కు వద్ద గుర్తించి తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద కేజిన్నర గంజాయి స్వాధీనం చేసుకుని షణ్ముఖ్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలుడిని హోమ్‌కు అప్పగించారు.

అటు ఆదర్శం.. ఇటు సమస్యలమయం

- ఆధునిక హంగులతో మురళీనగర్ వాకర్స్ పార్కు
- పేరొందిన ఉద్యానవనాన్ని వేధిస్తున్న సమస్యలు
- జీవీఎంసీ సహకరిస్తే మరింత అభివృద్ధి



మహాత్మా గాంధీ విగ్రహం



మురళీనగర్ వాకర్స్ పార్కు ముఖద్వారం



పార్కులో బుద్ధుడి ప్రాంగణం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు నగరంలోనే ప్రసిద్ధి చెందింది. 1995లో వాకర్స్ క్లబ్ ఏర్పాటైన తర్వాత దీని అభివృద్ధిపై దృష్టి సారించారు. నడక.. ఆరోగ్యం.. పచ్చదనం పరిరక్షణ.. సామాజిక సేవా భావం వంటి క్లబ్ ప్రధాన ఆశయాల సాధనలో భాగంగా వాకర్స్ పార్కును ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఈ పార్కును ప్రస్తుతం కొన్ని ప్రధాన సమస్యలు వేధిస్తున్నాయి. వీటి పరిష్కారానికి వాకర్స్ ఎదురు చూస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కాస్త సహకరిస్తే మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నిర్వాహకులు చెబుతున్నారు.

అభివృద్ధిలో ముందంజ

క్లబ్‌తోపాటు వాకర్స్ పార్కు అభివృద్ధికి సభ్యులు విశేష కృషి చేస్తున్నారు. ఎక్కడ చూసినా పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. అరుదైన వృక్షాలను పెంచుతున్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కె.జి.కృష్ణారావు, సిహెచ్.కృష్ణమూర్తి, ఎం.భాస్కరరావు, సత్తి సునీల్‌రెడ్డి, కె.ద్వారకానాథ్, పల్లా చంద్రమౌళితోపాటు ప్రస్తుత అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో క్లబ్ సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తోంది. గతంలో పార్కులో సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. కొత్తగా బోరు ఏర్పాటు చేశారు. ఆధునిక ముఖద్వారం, మహాత్మా గాంధీ, బుద్ధ భగవానుడి విగ్రహాలు ఇక్కడ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఉత్తరాంధ్ర తేజోమూర్తులు విజ్ఞానాన్ని, చరిత్రను తెలుపుతున్నాయి. మరుగుదొడ్లు అందుబాటులోకి తెచ్చారు. క్లబ్ ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. తాగునీటి సౌకర్యంలో భాగంగా ఆక్వా వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటు, క్లబ్‌కు డిజిటల్ చెల్లింపు సదుపాయం, మ్యూజిక్ సిస్టం వంటి ఆధునిక హంగులు సమకూర్చారు.

అధికారులకు వినతులు

వాకర్స్ పార్కు మాజీ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళితో కూడిన కార్యవర్గ సభ్యులు ఐదు నెలల కిందట ఇక్కడి పరిస్థితులపై జీవీఎంసీ కమిషనర్‌తోపాటు ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజుకు వినతిపత్రాలు అందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గత నవంబర్‌లో అధికారులు కొలతలు కొలిచి అంచనాలు రూపొందించి వదిలేశారు. ఇటీవల కాలంలో నూతన అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో సభ్యులు అధికారులను కలిశారు. ఇటీవల జోనల్ కమిషనర్ తన పర్యటనలో భాగంగా పార్కులో పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్సీ ఆదేశాల మేరకు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి అప్పటికప్పుడు కొలతలు కొలిచారు. ఇలా చేయడం రెండోసారి కావడం విశేషం. ఇప్పటికైనా ఇక్కడి సమస్యల పరిష్కారానికి మోక్షం కలుగుతుందో లేదో వేచి చూడాల్సిందే.

ప్రాంగణం పైకప్పు కోసం

తాజా మాజీ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళితో కూడిన పూర్వ కార్యవర్గం ఆధ్వర్యంలో పార్కులోని వేదిక ఎదురుగా ఉన్న ప్రాంగణాన్ని విశాలంగా నిర్మించారు. దీనికి పైకప్పు లేకపోవడం వల్ల సమావేశంలో పాల్గొన్న సభ్యులకు ఎండ, మంచు, వర్షం నుంచి రక్షణ కరవైంది. ఈ ప్రాంగణానికి పైకప్పు నిర్మించాలని వాకర్స్ కోరుతున్నారు. ఇది పూర్తయితే మురళీనగర్‌లోని పార్కుల అన్నింటి లోనూ ప్రాంగణానికి పైకప్పు ఉన్న మొట్టమొదటి పార్కుగా పేరు వస్తుంది.



రూఫ్‌టాప్ కోసం ఎదురుచూస్తున్న ప్రాంగణం

ప్రహరీ శిథిలం.. రక్షణ అవసరం



పార్కు లోపలికి వంగిపోయిన ప్రహరీ

ఈ పార్కులో అనేక సౌకర్యాలున్నా.. కొన్ని సమస్యలు వేధిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్ సమీపంలో రహదారిని ఆనుకుని నిర్మించిన ప్రహరీ శిథిలమైంది. ఇది పార్కు లోపలి వైపు ఒరిగిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు మూడు మీటర్ల ప్రాంతం పగుళ్లు పడింది. దీని బేస్‌మెంట్ కూడా పూర్తిగా పాడైంది. 1984లో నిర్మించిన ఈ ప్రహరీ పరిస్థితి దారుణంగా తయారైంది. దీన్ని పూర్తి స్థాయిలో పటిష్టంగా నిర్మించి పార్కుకు రక్షణ కల్పించాలి. ప్రస్తుతం పార్కులో రంగులు వేసి అందంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదొక్కటే ప్రధాన లోపం

వాకర్స్ పార్కులో ప్రస్తుతం సిమెంట్ వాకింగ్ ట్రాక్ ఉంది. మురళీనగర్‌లోనే మొట్టమొదటి ఉత్తమ పార్కుగా పేరొందిన చోట మట్టి వాకింగ్ ట్రాక్ లేకపోవడం పెద్ద లోపమే అని చెప్పవచ్చు. ఇక్కడి వాకర్స్ క్లబ్‌లో 50 ఏళ్లు దాటిన వారు ఎక్కువ మంది ఉన్నారు. వీరందరూ ఉదయం, సాయంత్రం ఇక్కడే నడక సాగిస్తారు. వయసు పెరిగే కొద్దీ వారు నడిచే మార్గాన్ని బట్టి కీళ్లపై ఒత్తిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో వాకర్స్ పార్కులో తక్షణం మట్టితో వాకింగ్ ట్రాక్ నిర్మించాల్సి ఉంది.



పార్కులో సిమెంట్ వాకింగ్ ట్రాక్

చలివేంద్రం ఏర్పాటు



సీతంపేట జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

సీతంపేట: ఉగాది పండగ సందర్భంగా గాంధీ హరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీతంపేట జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని స్థానిక నాయకులు సంపంగి శ్రీనివాసరావు, భీమవరపు శ్రీనివాసరావు, బోర ఈశ్వరరావు, బోగవిల్లి గోవింద్ ప్రారంభించారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రతి రోజూ చల్లని మజ్జిగ, తాగు నీరు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జామి శివ, లక్ష్మణరావు, గోపి, ఆదినారాయణ, వెంకటరెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న పీఎస్‌కే మూర్తి, ఆర్‌వీ రమణ తదితరులు

మల్కాపురం: మాధవధార, వంశీనగర్ సర్వీస్ రోడ్డులో ఆదివారం ఉగాది సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ గుర్తింపు యూనియన్ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ పీఎస్‌కే మూర్తి, జనరల్ మేనేజర్ ఆర్.వి. రమణలు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవి తాపం పెరుగుతున్న తరుణంలో చలివేంద్రాల ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకుడు, హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నంబాల ధనుంజయరావు పాల్గొన్నారు..

శిరేల సన్యాసిరావుకు ఉగాది పురస్కారం

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు ముఖ్యమంత్రి చంద్రబాబు, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

మిన్నంటిన ఉగాది సంబరాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- లలితాపీఠంలో పంచాంగ శ్రవణం
- బీవీకే కళాశాలలో కవితా గోష్ఠి



శంకరమఠం రోడ్డులో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: 'విశ్వావసు'తెలుగు సంవత్సరాది, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతంపేటలోని దుర్గా గణపతి, పార్వతీశ్వరాలయం, గురుదత్త సాయి ఆలయం, అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠం, షిర్డీ సాయి మందిరం భక్తులతో పోటెత్తాయి.

శ్రీలలితాపీఠంలో..

లలితాపీఠంలో పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో లలితాకామేశ్వరి అమ్మవారికి క్షీరాభిషేకం, అనంతరం బంగారు చీర అలంకరణ చేశారు. వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సీతారాముల ఉత్సవ మూర్తులకు సహస్ర నామార్చన చేశారు. సాహిత్య విద్యాప్రవీణ కొక్కిరిగడ్డ సూర్యనారాయణమూర్తి పంచాంగ శ్రవణం జరిగింది. అనంతరం జి.నారాయణ బృందంచే నాదస్వర కచేరీ అలరించింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీవీకే కళాశాలలో..

అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక బీవీకే కళాశాలలో ఉగాది కవితా గోష్ఠి నిర్వహించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు సభాధ్యక్షతన జరిగిన కవితా గోష్ఠిలో ప్రముఖ రంగస్థల నటుడు డాక్టర్ మీగడ రామలింగస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ మోపిదేవి విజయ్‌గోపాల్ ప్రసంగిస్తూ భారతీయ విలువలను కవులు, రచయితలు చాటి చెప్పాలన్నారు. కుప్పిలి భీమేశ్వరరావు, పి.కె.జయలక్ష్మి, పిళ్లా రమణమూర్తి, గౌరీపతి శాస్త్రి, సి.హెచ్.నిర్మల, భాగవతుల సత్యనారాయణ, నిర్మలరాజు కవితాగానం చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిషత్ కార్యదర్శి ఎం.మోహన్‌రావు పర్యవేక్షించారు.

షడ్రుచుల దివ్య ఔషధం..

శంకరమఠం రోడ్‌లోని వీడెంటల్ హెల్త్‌కేర్ సెంటర్‌లో ఉగాది వేడుకలు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ మాట్లాడుతూ ఉగాది పచ్చడి తయారీలో వినియోగించే వేపపువ్వు, చింతపండు, ఉప్పు, బెల్లం, మిరియాలు రోగ నిరోధకశక్తి పెరుగుదలకు దోహదపడతాయన్నారు. సుమారు 500 మందికి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.రమ్య, రాజ్యలక్ష్మి, ప్రశాంతి, లతీష, లిఖిత్, సీహెచ్ పార్వతి. కె.మేరీ, కె.తులసి తదితరులు పాల్గొన్నారు.



బీవీకే కళాశాలలో జరిగిన కవితా గోష్ఠిలో పాల్గొన్న కవులు, రచయితలు

ఆలయాలకు ఉగాది శోభ..

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని రామాలయం, వైభవ వేంకటేశ్వరస్వామి, సూర్యనగర్‌లోని యోగసిద్ధాంజనేయస్వామి, పట్టాభిరెడ్డితోటలోని దాసాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దాసాంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ఆరవిల్లి సీతారామాచార్యులు, యోగసిద్ధాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు శ్రీకాంతాచార్యులు, వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శేషాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ రాశి ఫలాలు తెలిపారు.

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

సీతమ్మధార: అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా , సిటీ శాఖల ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల కార్యక్రమం ఒక హోటల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందించిన 45 మంది మహిళలను సత్కరించారు. ముఖ్య అతిథులుగా నరవ అనంతం, కళ్లేపల్లి కూర్మనాథ్, మధుసూదన్, రవిచంద్ర, బోయిదాపు రామారావు, సంకిస భవానీప్రియ, సిటీ సంఘం అధ్యక్షుడు ఎన్.ఎ.ఎన్. రాజు, పోలిపల్లి అప్పలరాజు, జామి అప్పలరాజు, అంబటి శంకరరావు, గండేపల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు

షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో..

తాటిచెట్లపాలెం: రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఉగాది, అన్నదాన కార్యక్రమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుండి భక్తుల స్వహస్తాలతో సాయిబాబాకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన చేశారు.



శ్రీలలితాపీఠంలో పంచాంగ శ్రవణం చేస్తున్న కొక్కిరిగడ్డ సూర్యనారాయణ

మధ్యాహ్నం సుమారు 500 మందికి భారీ అన్నసమారాధన చేపట్టారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించి 15 వసంతాలు పూర్తయిన సందర్భంగా సహకరించిన భక్తులు, దాతలకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు ధన్యవాదాలు తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ శ్రీరామనవమి వరకు ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'సాగరి' ఆధ్వర్యంలో..

విశాఖ పోర్టు అథారిటీ 'సాగరి'(పోర్టు సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో ఆదివారం సాలగ్రామపురంలో గల శ్రీ సీతారామ కల్యాణ మండపంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అడబాల సత్యనారాయణచే పంచాంగ శ్రవణం, సహృదయ సాహితీ, అమరావతి విశ్వసాహితీ వంటి సంస్థల ప్రతినిధులు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. నృత్యభారతి డ్యాన్స్ అకాడమీచే నృత్య ప్రదర్శన జరిగింది. విశాఖ జిల్లా సాహితీ స్రవంతి అధ్యక్షుడు పాలమరశెట్టి ఫ్రాన్సిస్, సీహెచ్ అవతారం, డీవీ ధర్మారావు, వందేమాతరం శ్రీనివాస్, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో అన్నదానం



సాలగ్రామపురంలోని సీతారామ కల్యాణ మండపంలో సత్కారం పొందిన కవులతో నిర్వాహకులు



వాకర్స్ పార్కులో పంచాంగ శ్రవణం చేస్తున్న ఎంవీ రాజశేఖర్



పంచాంగ శ్రవణ కార్యక్రమానికి హాజరైన మురళీనగర్ వాసులు



షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో బాబాను అభిషేకిస్తున్న భక్తులు

సంగీత సమితి సేవలు ప్రశంసనీయం



సంగీత సమితి ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న డాక్టర్ రవిరాజు, అతిథులు

సీతంపేట: ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత సమితి ప్రథమ వార్షికోత్సవం స్థానిక శంకరమఠంలో ఆదివారం ఘనంగా జరిగింది. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట సంగీత సంస్థను స్థాపించి, తద్వారా నిర్వహించిన సంగీత సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. శాస్త్రి జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచిందన్నారు. అతిథులు జి.ఆర్.కె.ప్రసాద్, వీవీబీ శంకరం, వి.ప్రకాశరావు సంగీత సమితి సేవలను కొనియాడారు. సంస్థ శిష్య బృందం ఆలపించిన సంకీర్తనలు, భక్తి గీతాలు ఆహుతులను రంజింపజేశాయి. ఐ.వి.ఎల్.సంగీత సమితి చైర్మన్ ఆకొండి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్‌మోహన్‌రావు, వి.మధుసూదనరావు, జి.మధుబాబు, ఎం.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, శంకరమఠం వేద విద్యార్థులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

అలరించిన విశ్వావ'సుకవి' సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన విశ్వావసు కవి సమ్మేళనం ఆహూతులను అలరించింది. వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ నిర్వహణలో పలువురు కవులు, రచయితలు ఉత్సాహంగా పాల్గొని తమదైన శైలిలో కవిత్వంతో రంజింపజేశారు. ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం, కళారూపాలు, భారతీయ సంస్కృతి ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కళాతపస్వి కె.విశ్వనాథ్ చేతుల మీదుగా 2010లో విశాఖ రసజ్ఞ వేదిక స్థాపించామన్నారు. గడిచిన 15 ఏళ్లలో 150కి పైగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విశాఖ రసజ్ఞ వేదిక 15 ఏళ్ల వైభవాన్ని పురస్కరించుకుని ఉగాది సందర్భంగా విశాఖలోని 24 మంది తెలుగు కవులను సత్కరించి, వారి చేత విశ్వావ'సుకవి' సమ్మేళనం నిర్వహించామన్నారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, కోలవెన్ను మలయవాసిని, డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, పేరి రవికుమార్, వెలమల సిమ్మన్న, మీగడ రామలింగస్వామి, ఈదర పెదవీర్రాజు తదితరులు కవిత్వంతో అలరించారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు



అశోక్‌కు మెమెంటో అందజేస్తున్న రామన్నపాత్రుడు

డాబాగార్డెన్స్: చదువుకు పేదరికం అడ్డు కారాదని, బీసీ విద్యార్థుల అభివృద్ధికి తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్నపాత్రుడు పేర్కొన్నారు. విశాఖ జిల్లా రావికమతం మండలం, మర్రివలసలో పేద రైతు కూలీ ఇంట జన్మించిన అమ్మిరెడ్డి అశోక్ చిన్నతనం నుంచి చదువు పట్ల శ్రద్ధతో ట్రిబుల్ ఐటీలో ప్రవేశం పొంది, ఈ ఏడాది గేట్‌లో 12వ ర్యాంకు సాధించడం సంతోషకరమని రామన్నపాత్రుడు తెలిపారు. అతని స్ఫూర్తిగా ఇతర విద్యార్థులు కూడా చదువుల్లో చక్కగా రాణించాలని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమంలో అమ్మిరెడ్డి అశోక్‌ను రామన్న పాత్రుడు సత్కరించి మెమెంటో అందజేశారు.